పత్తి కొనుగోళ్లు నిలిపివేత

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 10వ తేదీ ఉదయం నుంచి ఆధార్ సర్వర్ డౌన్ ఉండడంతో సాంకేతిక సమస్య కారణంగా సీసీఐ వారిచే పత్తి కొనుగోళ్లు నిలిపివేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసే సమయంలో పత్తి రైతుకు ఆధార్ ప్రామాణికం కావడం లేదని, ఈ కారణంగా వ్యవసాయ మార్కెట్ యార్డు చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేటల్లో పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

నస్పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెయిన్స్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) కు నస్పూర్‌లోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. సల్లూరి రణధీర్, టెకం నరేష్, సల్లూరి అక్షరలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌నకు ఎంపిక అయినట్లు తెలిపారు. స్కాలర్ షిప్ ప్రవేశ పరీక్షకు పాఠశాల నుంచి 12 మంది హాజరు కాగా ముగ్గురు మెరిట్ సాధించి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి తొమ్మిద తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ. 12వేల చొప్పున స్కాలర్ షిప్ వస్తుందని రామన్న తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నియోజకవర్గంలోని పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ, చెన్నూరు నియోజకవర్గ కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ బుధవారం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కోటపల్లి, చెన్నూరు, జైపూర్ మండలాలకు చెందఇన పత్తి రైతులు మిల్లుల దగ్గర పడిగాపులు కాస్తున్నారని వెంటనే పత్తి కొనుగోలు చేసి రైతు కష్టాలను తీర్చాలని విన్నవించారు. వెంటనే మార్కెటంగ్ ఏడిని పత్తి మిల్లుల వద్దకు పంపించి సమస్య పరిష్కరిస్తానని అదనపు కలెక్టర్ తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంత్రి రామయ్య, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

చెన్నూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఏ సమస్య ఉన్నా సకాలంలో పరిష్కరించాలని విద్యుత్ శాఖ చైర్ పర్సన్ నారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ శాఖలో అంతరాయం, హెచ్చు తగ్గులు, విద్యుత్ మీటరు సమస్యలు, మీటరు ఎక్కువగా తిరగడం, ఆగిపోవడం, కాలిపోవుట, విద్యుత్ బిల్లుల సమస్యలు, ఎక్కువ బిల్లు వచ్చుట, కొత్త సర్వీసులు, ఓవర్ లోడ్, విద్యుత్ బిల్లుల్లో పేరు మార్చుట తదితర సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికా రులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు

అడ్డంకులు తొలగేనా?

- 292 ఎకరాల్లో ఐటీ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు
- స్థల పరిశీలన చేసిన పరిశ్రమలశాఖ అధికారులు
- వ్యాపారులకు స్థలాలు అప్పగించడమే తరువాయి
- భూములకు పరిహారంపైనే సందేహాలు



మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హాజీపూర్ మండలంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నందున ఉద్యోగావకాశాలు మెరుగుపడనుండగా, అందుకు అడ్డంకులు తొలగిపోయినట్లేనా అన్న సందేహాలు సర్వత్రా ఉన్నాయి. మండలంలోని 292 ఎకరాల స్థలంలో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తరుచుగా చెబుతూ వస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే భూ సేకరణకు పూనుకోగా, పరిశ్రమలు స్థాపించే వ్యాపారులకు స్థలాలను అప్పగించాలనే యోచనలో ఉన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా కూడా ఐటీ హబ్ లేకపోగా మంచిర్యాల నియోజకవర్గంలోనే దానికి అంకురార్పణ జరుగుతుండటంతో ఒకవైపు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా, మరోవైపు నష్ట పరిహారం చెల్లింపులపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, అంతా సవ్యంగా జరిగి, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసే అర్హతగల స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడనుండగా, ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

వ్యాపారులతో ముఖాముఖి...

ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కులో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పెట్టుబడి దారులు, వ్యాపారులను ఆహ్వానించే క్రమంలో జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ల నేతృత్వంలో పరిశ్రమలశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే భూ సేకరణ జరిగినందున వ్యాపారులు ముందుకు వస్తే భూములు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యం, రహదారుల ఏర్పాటు, తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు. స్థానికంగా ఖనిజ, బొగ్గు వనరులతో పాటు రైల్వే మార్గం అందుబాటులో ఉండటంతో వ్యాపారులకు సౌలభ్యంగా ఉండనుంది. ఈ సందర్భంగా వ్యాపారులను ప్రోత్సహించేందుకు అధికారులు అవసరమైన కార్యాచరణ చేపట్టారు. అనుకున్న విధంగా ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు ఏర్పాటు చేసిన పక్షంలో ఈ ప్రాంతం ఊహించని విధంగా అభివృద్ధి చెందడంతోపాటు ఇక్కడి భూముల ధరలు సైతం ఆకాశాన్నంటే అవకాశాలు ఉన్నాయి. తద్వారా స్థానిక ప్రజలకు మేలు చేకూర్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

పేదలకు అసైన్ చేసిన ప్రభుత్వం....

సదరు స్థలం గతంలో కొందరు భూమి లేని నిరుపేదలకు సాగు నిమిత్తం ప్రభుత్వం అసైన్డ్ చేసింది. కొంతకాలం పాటు భూమిని సాగుచేసిన లబ్దిదారులు అనంతరం వదిలివేయడంతో బీడు భూమిగా మారింది. ప్రభుత్వం నుంచి భూములు పొందిన లబ్దిదారుల పేరిట అసైన్‌మెంట్ చట్టం ప్రకారం ప్రభుత్వం సాగు హక్కులు కల్పించింది. 1977లో అమల్లోకి వచ్చిన అసైన్‌మెంట్ చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన భూములను హక్కుదారులు కేవలం సాగు మాత్రమే చేయాల్సి ఉంది. క్రయ, విక్రయాలు జరిపేందుకు వీలులేదు. ప్రత్యేక పరిస్థితుల్లో విక్రయాలు చేయాలనుకుంటే..

పూర్తయిన స్థల పరిశీలన..

జిల్లాలోని హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్‌లు 154, 155, 159తో పాటు సమీపంలోని మొత్తం 292 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇండస్ట్రియల్ హబ్ కోసం వినియోగించ నుండగా, ఇటీవల డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, టీజీఐఏసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తితోపాటు జిల్లాస్థాయి అధికారులు పరిశీలించి సంసిద్ధత తెలిపారు. గతంలో కొంతకాలం ఆ భూముల్లో కొంత భాగం మంచిర్యాల మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం వినియోగించారు. అయితే డంప్ యార్డు ఏర్పాటు చేసి, మున్సిపల్ చెత్త వేయడం వల్ల అది కుళ్లి దుర్గంధం వ్యాపించే అవకాశం ఉన్నందున గ్రా మస్తులు కొందరు అభ్యంతరం తెలిపారు. స్థలం చుట్టూ ప్రహరీ లేకపోవడం మూలంగా వర్షాకాలంలో కుళ్లిన పదార్థాలు సమీపంలోని చెరువుల్లోకి చేరే ప్రమాదం ఉన్నందున డంపిం గ్ యార్డును నిలిపివేయాలని కోరుతూ 2016 లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు సద రు స్థలంలో చెత్త డంప్‌ను నిలిపివేశారు. ప్రస్తుతం అవే భూముల్లో ఐటీ పార్కుకు అంకురార్పణ జరుగగా, పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వ్యాపారులకు స్థలం అప్పగించడమే మిగిలి ఉంది.

(తరువాయి 7లో)



ఐటీ హబ్ కోసం కేటాయించిన స్థలం



పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు

తరచూ రోడ్డెక్కుతున్న అన్నదాతలు

వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై వేటు

7



6

తునికాకు సేకరణ ప్రారంభమయ్యేనా?

- వేసవిలో గిరిజన గ్రామాలకు ఉపాధి వనరు
- ఈ ఏడాది ఇప్పటికీ ఖరారు కాని టెండర్లు
- కూలీల్లో ఆందోళన

గూడెంలో మాఘశుద్ధ పౌర్ణమి జాతర

ఘనంగా పూర్ణాహుతి, నిత్య హోమం

దండేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు, మాఘశుద్ధ పూర్ణిమిని పురస్కరించుని బుధవారం దేవాలయంలోని సత్యదేవుడికి పుష్పాలంకరణతో ప్రత్యేక పూజల వైభవో పేతంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు గోవర్ధన రఘుస్వామి, సంపత్ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు అభిరామ్‌చార్యులు, నారాయణశర్మ, భరత్‌శర్మలు చాత్తాద శ్రీ వైష్ణవ ఆచార సంప్రదాయం ప్రకారం స్వామి వారికి జయాది హోమం, శాంతి హోమం, మహా పూర్ణాహుతి, బలిహరణము, నిత్య విధి, ప్రాబోధిక ఆరగింపుతో పాటు స్వామి వారి సేవ కార్యక్రమాలను వైభోపేతంగా నిర్వహించారు.

పౌర్ణమి రోజు భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానం చేసి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో సామూహిక స్వామి వ్రతాలను ఆచరించారు. దర్శనం కోసం వచ్చిన భక్తులందరికీ స్వామి తీర్థప్ర సాలను అందజేశారు. అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు. పౌర్ణమి జాతరతోగూడెం పరిసర ప్రాంతమంతా భక్తులతో సందడి నెలకొంది. ఆలయంలో నిరంతరంగా సపాహ్త భజన కొనసాగుతోంది.



పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మహిల సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు విజయ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగా హన సదస్సులో లిటరసీ కార్యక్రమ ప్రతినిధి లిఖితతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సఖి హెల్ప్ లైన్ 181, చైల్డ్ హైల్ప్‌లైన్ 1098, మహిళ హెల్ప్‌లైన్ 1930, పోలీసు హెల్ప్ లైన్ 100, సుకన్య సమృద్ధి యోజన, చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికయిన బాలికల జట్టు

నస్పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో బుధవారం అండర్-16 బాల బాలికల కబడ్డి జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఎంపికైనా బాల బాలికల జట్లు ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లా షేక్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయి. జిల్లా తరుపున రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుల జట్లను తెలంగాణ రాష్ట్ర కబడ్డి అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ రాంచందర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డి అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్, రేగళ్ల ఉపేందర్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఎంపికైన బాలికల జట్టు : జిల్లా నుంచి కబడ్డి జట్టు స్థానం సాధించిన బాలికల జట్టులో ఉ షారాణి, నిరీక్ష, శాశ్వత, కృష్ణ కుమారి, అక్షయ, మనోజ్ఞ, అనన్య, సం గీత రాణి, క్రాంతికేయ, చంద్రస్మిత, సమన్వి, వేదన సాయి, హారిక, సహస్ర, అక్షరలు ఉన్నారు.

ఎంపికైన బాలుర జట్టు : జిల్లా నుంచి కబడ్డి ఎంపిక పోటీలో జట్టులో స్థానం పొందిన బాలుర జట్టులో సందీప్, అదిత్య, రఘువర్ధన్, మనోజ్, ప్రసాద్, విక్షిత్, సాయి రిషిత్, జస్వంత్, హర్షత్, చరణ్‌చంద్ర, రంజిత్, చరణ్‌లు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికలపై అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సర్పంచు, వార్డు సభ్యుడు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఈ క్రమంలో అందిస్తున్న శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలన్నారు. ఎన్నికల విధులను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలన్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు కల్పన, పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.


పద్మల్ పూరీ కాకో విగ్రహ పునః ప్రతిష్ఠ



అమ్మవారికి గంగాజలాభిషేకం చేస్తున్న గిరిజనులు

దండేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంప్రదాయాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు గౌరవం ఉందని, రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరం ఒడ్డున గల పద్మల్‌పూరీకాకో ఏత్మల్‌సార్ పేన్ దేవాలయంలో బుధవారం విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలను నిర్వహించారు. గిరిజన డొలు వాయిద్యాలతో కాకో అమ్మవారి విగ్రహాన్ని గోదావరికి తీసుకెళ్లి ఆదివాసీ సంప్రదాయ పద్ధతుల్లో పూజలు చేసి, అమ్మవారికి పవిత్ర గంగాజలంతో జలాభిషేక చేయించారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని ప్రతిష్టించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుడిమేత సోముపటేల్, ఆలయ కమిటీ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

వేతనం పెంచాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ కార్మికుడికి వేతన చట్ట ప్రకారం రూ. 20 వేలు చెల్లించాలని సుప్రీం కోర్టు తీర్పును ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయడం లేదన్నారు. కొంత మంది పీఎఫ్ జీతం నుంచి కట్ అయినప్పటికీ పీఎఫ్ ఖాతాలో జమ కావడం లేదని, కట్ అయిన మొత్తాన్ని పీఎఫ్‌లో జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీకి సంబంధం లేకుండా సాయికిరణ్ అనే వ్యక్తి ఈపీఎఫ్‌లో పేరు నమోదు చేసుకొని ఉద్యోగం చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సత్యం, సాయితేజ, రమేష్ పాల్గొన్నారు.

అందరూ ఐక్యతతో పని చేసుకోవాలి

- లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్
- లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు



కార్యాలయం ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రేమ్‌చంద్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఓనర్లు, డ్రైవర్లు అం దరూ ఐఖ్యతతో కలిసి మెలిసి పని చేసుకోవాలని లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ అన్నారు. పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో బుధవారం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన జిల్లా నుంచి బొగ్గు రవాణ ఉన్న సమయంలో లారీ ఓనర్లు గానీ డ్రైవర్లకు గానీ చేతినిండా పని ఉండేదని కానీ రోజు రోజుకూ బొగ్గు రవాణ తగ్గిపో తుండటంతో లారీ ఓనర్లకు ఇబ్బందులు కలిగాయన్నారు. కానీ ఇప్పుడు మన ప్రాతం నుంచి పత్తి, వరి ధాన్యం సరఫరా పెరిగిపోయిం దని లారీ ఓనర్లు డ్రైవర్లు అందరు కలిసి ఉండి రవాణా చేసుకుని ఎదగాలని సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్‌తో కలిసి అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, రవాణా శాఖ జిల్లా డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, లారీ అసోసియేషన్ అడల్స్ కమిటీ చైర్మన్ మహ్మద్ ఖలీద్, సభ్యులు కరీంబాబా, షరీం, ఆజాం, యూసుఫ్, శ్రీనివాస్‌రెడ్డి, అలీమ్, మజీద్, లచ్చన్న, సల్మాన్ పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఎన్నికలు ఎప్పుడో..?

- జిల్లాలో 12 రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు..
- కొత్తగా మరో మూడు పీఏసీఎస్‌లు...

నస్పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గ పదవి కాలం ఈ నెల 15తో ముగుస్తుంది. జిల్లాలోని 20 సహకార సంఘాలకు పాలక వర్గ పదవి కాలం ముగుస్తున్నందున పొ డగిస్తారా...ప్రత్యేక అధికారులను నియమిస్తారా అన్న విషయం పై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. సహకార సంఘాలకు 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఒక వైపున ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా మరో వైపు గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ తరుణంలో సహకార సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రస్తుతం కొంత ఆల స్యమయ్యే అవకాశాలున్నాయి. సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించాలనే యోజనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా 15వ తేదీలోగా ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

12 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రతిపాదన..

కేంద్ర ప్రభుత్వం ద్వారా కొత్తగా 12 రైతు ఉత్ప త్తిదారుల సంఘాల ఏర్పాటుకు సహకార శాఖ ప్రతి పాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపింది. తద్వారా రైతులకు మరిన్ని సేవలను అందుబాటులోకి రానున్నాయి.. ఇందులో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఫార్మర్ ప్రొడ్యూసర్ అర్గనైజేషన్ (రైతు ఉత్పత్తిదారుల సంఘం) ద్వారా దాదాపు 40 రకాల సేవలను అందించడంతో రైతులు పండించిన ఉత్పత్తుల మార్కెటింగ్, వ్యవసాయానికి అవసరమైన వాటిని సమకూర్చుతారు. మంచిర్యాల, చెన్నూరు, జైపూర్, కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల, వెంకటాపూర్, పద్దనపల్లి, మందమర్రి, ధర్మరావుపేట, తాండూరు, చంద్రవెల్లిల్లో కొత్తగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసారు.



మంచిర్యాల సహకార సంఘం కార్యాలయం

- ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి..

సంజీవ రెడ్డి- జిల్లా సహకార శాఖ అధికారి



సహకార సంఘాల పదవీ కాలం 15తో ముగుస్తుంది. ఇంకా ప్రత్యేకాధికారుల నియామకమా, కొనసాగింపా అనే విష యం ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది. 15నాటికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావచ్చు. అప్పటి వరకు ఆగాలి. కొత్తగా కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా 12 ఎంపీవోల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాము. వీటి ద్వారా రైతులకు మరిన్ని సేవలు, ఉపాధి, సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

మరో మూడు పీఏసీఎస్‌లు..

మంచిర్యాల జిల్లాలో కొత్తగా మరో మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు కానున్నాయి. నస్పూర్, కన్నెపల్లి, భీమారంలో ఏర్పాటు చేయడానికి సహకారం శాఖ అధికారులు ప్రతిపా దించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఇక్కడ సంఘాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా లుండగా కొత్త వాటితో కలిపి 23కు చేరనున్నాయి. అంతే కాకుండా అదనంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా రానున్నాయి.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జయరాజు, ఎంఈవో చింతలమానేపల్లి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : పదో తరగతి వార్షిక పరీక్షలకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంఈవో: పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ రెండో తేదీన ముగుస్తాయి.

ఆంధ్రజ్యోతి : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంఈవో: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

ఎంఈవో: మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 207 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

- చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి)

పేకాటరాయుళ్ల అరెస్టు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం బలరావుపేట గ్రామ శివారులో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని 13వేల రూపాయల నగదు, 6సెల్‌ఫోన్‌లు, 5బైకులను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ పేర్కొన్నాడు.

కడుపు నొప్పితో వృద్ధుడి ఆత్మహత్య

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్‌కు చెందిన నగోసే తివంజి(75) అనే వృద్ధుడు కడుపు నొప్పి భరించ లేక మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నగోసే తివంజి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో మంగళవారం రాత్రి బహిర్భూమికని వెళ్లి తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుకి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

108లో ప్రసవం

భీమారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుర్తె సునీత బుధవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. సునీతకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. వెంటనే సునీతను అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ మహేష్ పురుడు పోయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లిబిడ్డను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ మహేష్, పైలెట్ పవన్‌కు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

తునికాకు సేకరణ ప్రారంభమయ్యేనా?

- వేసవిలో గిరిజన గ్రామాలకు ఉపాధి వనరు
- ఈ ఏడాది ఇప్పటికీ ఖరారు కాని టెండర్లు
- కూలీల్లో ఆందోళన

ప్రకృతి సంపద తునికాకు. ఏటా వేసవిలో వందలాది మందికి నెల రోజుల పాటు ఆదాయ వనరు. ప్రతీ ఏడాది మే నెలలో తునికాకు సేకరిస్తారు. దీని కోసం జనవరిలోనే టెండర్లు నిర్వాహించాల్సి ఉంది. ఈ ఏడాది ఆ దిశగా చర్యలు లేక పోవడంతో కూలీల్లో ఆందోళన నెలకొంది.

బెజ్జూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవిలో గిరిజనులు, కూలీలకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణపై స్పష్టత కరువైంది. ఇప్పటికే అటవీ శాఖ తునికాకు సేకరణ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో తునికాకు కూలీల్లో ఆందోళన నెలకొంది. మూడేళ్ల క్రితం నుంచి జిల్లాలో తునికాకు సేకరణ ఉండదని అధికారులు చెప్పారు. జిల్లాను టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేయడంతో పులుల సంచారం పెరిగిందని అధికారులు చెబుతూ వచ్చారు.

2023లో కారిడార్ పేరిట జిల్లాలో తునికాకు సేకరణ ప్రక్రియను పూర్తిగా నిలిపి వేయాల్సిందిగా అప్పట్లో అటవీ శాఖ ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. కూలీలు ఉపాధికి దూరమవుతారనే ఉద్దేశ్యంతో అప్పట్లో ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు తిరస్కరించారు. కూలీలకు ఉపాధి కల్పించాలని విన్నపించడంతో తునికాకు సేకరణ ప్రక్రియ కొనసాగింది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తనుకోక పోవడంతో ఈ ఏడాది తునికాకు సేకరణ ఉంటుందా లేదా అని కూలీల్లో సందిగ్ధం నెలకొంది.

టెండర్లపై స్పష్టత కరువు..

తునికాకు సేకరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా ఇంకా దీనిపై స్పష్టత రాలేదు. ఏటా జనవరిలోనే కల్లాల నిర్వహకు టెండర్లను పిలవాల్సి ఉంది. టెండర్లు పూర్తయ్యాక కొమ్మకొట్టే పనులుచేపడతారు. దీంతో ఆకు ఏపుగా పెరుగుతుంది. అనంతరం మే నెలలో ఆకు సేకరణ ప్రారంభమవు తుంది. ఈ ఏడాది ఇంకా టెండర్లే నిర్వహించలేదు. అటవీ ప్రాంతం ఆనుకొని ఉన్న గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు, ఇతర కూలీలు తునికాకు సేకరణతో ఉపాధి పొందుతున్నారు. టైగర్ కారిడార్ కారణంగా ఏటా తునికాకు సేకరణ పనులు ఆలస్యం అవుతూనే ఉంది.

15 యూనిట్లు, 157 కల్లాలు..

జిల్లా పరిధిలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్లలో మొత్తం 11రేంజ్‌లు ఉన్నాయి. 15యూనిట్లలో 157కల్లాలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో గతేడాది కాగజ్‌నగర్ డివిజన్‌లో 20,600 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు యూనిట్లలో పనులు చేయలేదు. దీంతో 17,700 బ్యాగులకు తగ్గించారు. గత ఏడాది కేవలం 14వేల స్టాండర్డ్ బ్యాగులు మాత్రమే సేకరణ పూర్తయింది. ఇంకా గతేడాదికి సంబంధించిన రూ.4కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

6.42లక్షల ఎకరాల్లో అటవీ భూమి..

జిల్లాలో 6.42లక్షల ఎకరాల్లో అటవీ భూమి విస్తరించి ఉంది. జిల్లాలో 11రేంజ్‌లు, 74సెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో తునికాకు సేకరణ ద్వారా సుమారు 15వేల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. దీని ద్వారా ఏటా ప్రభుత్వానికి 10కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. సేకరణ ద్వారా వచ్చిన ఆదాయం 5కోట్లకు పైగా కూలీలకు వెళ్తున్నది.

అధికారుల నిర్ణయంతో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు కూలీలు ఉపాధి కోల్పోనున్నారు. ప్రతీసారి తునికాకు సేకరణకు జనవరిలోనే టెండర్లు పిలవాల్సి ఉన్నా ఏటా ఆలస్యం చేయడం వల్ల కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ ఏడాది పనులు చేపట్టకపోవడంతో తునికాకు సేకరణ ఉంటుందా లేదా అన్న సందిగ్ధం నెలకొంది.

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం..

సుశాంత్ బొగాడె, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

జిల్లాలో తునికాకు సేకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. సేకరణపై కూలీలు ఎలాంటి ఆందోళన చెందవద్దు. రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు ఇంకా ఖరారు కాలేదు. తునికాకు సేకరణ ఉండదని ఎలాంటి నివేదికలు ప్రభుత్వానికి అందజేయలేదు. టెండర్ల ప్రక్రియ కాగానే తునికాకు సేకరణ పనులు చేపడతాం.



బెజ్జూరులో తునికాకు కట్టలు కడుతున్న కూలీలు (ఫైల్)

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



హాస్టల్‌ను పరిశీలిస్తున్న రమాదేవి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రమాదేవి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు రాజేంద్ర ప్రసాద్, వార్డెన్ వాణి ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ నిల్

- నేటితో ముగియనున్న గడువు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుందని, బుధవారం అభ్యర్థులెవరూ ఉపసంహరించుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, పరిశీలనలో 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, 68 మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైందని, 16 మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగియనున్నట్లు వెల్లడించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

- మూడు ఇళ్లు దగ్ధం
- సుమారు రూ. 4.50 లక్షల ఆస్తి నష్టం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త రహపల్లిలో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని మూడు ఇళ్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన షెండె బాపు, షెండె అన్నరావు, షెండె ఆనంద్‌రావు కుటుంబీకులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. షెండె బాపు ఇంట్లో షార్ట్‌సర్క్యూ ట్‌తో మంటలు అంటుకుం టున్నాయి. పొగలు రావడాన్ని గ్రామస్థులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. కాగజ్‌నగర్ ఫైర్ అధికారి భీమయ్య, సిబ్బంది విజయ్‌కుమార్, యుగేందర్, బానేష్, నాగరాజు, దుర్గప్రసాద్, ఖలీల్‌లు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే మంటలు అంటుకుని ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలాయి. మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడి పక్కపక్క నే ఉన్న అన్నదమ్ములైన అన్నరావు, ఆనంద్‌రావు ఇళ్లకు అంటుకున్నాయి. మంటలకు మూడు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో మొత్తం మూడు కుటుంబాలకు సుమారు రూ. 4.50 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ మూడు ఇళ్లకు పక్కనే ఉన్న వినాయక్‌రావుకు సంబం, దించిన 20 క్వింటాళ్ల పత్తి మంటల్లో కాలిపోయింది. బాదిత కుటుంబాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. తక్షణ ఆర్థిక సహాయం కింద కొంత నగదుతో పాటు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. బాధితులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి తహసీల్దార్‌కు సూచించారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ ఆలీబీన్ అహ్మద్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జాబరి రవిందర్ తదితరులు ఉన్నారు.

నకిలీ విలేకరుల అరెస్టు

- రూ. 90 వేల నగదు, కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

వేమనపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విలేకరుల ముసుగులో జిల్లాలో పలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పశువులను తీసుకువెళ్లే వాహనాలను అడ్డగించి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ విలేకరులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్‌ఐ శ్యామ్‌పటేల్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చొప్పదండి జనార్ధన్, తుంగ రమేష్, మాసాని రమేష్, తోడేటి సంతోష్, జిల్లపల్లి పోశం, తగరం వెంకటేష్, దొబ్బల విష్ణులు నకిలీ ఐడీ కార్డులు సృష్టించి విలేకరులమని చెబుతూ గ్రామాల్లో అక్రమంగా వసూళ్లకు పాల్పడు తున్నారు. ఈ ఏడుగురిపై గతంలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమో దయ్యాయి. ఇటీవల మండలంలోని గోదావరిఖనికి చెందిన పశువుల వ్యాపారులు సుంపుటం గ్రామంలో పశువులను కొనుగోలు చేసి సంతలో విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా ఈ ఏడుగురు నిందితులను విలేకరులమని బెదిరించి డబ్బులు వసూలు చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 90 వేల నగదు, ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. విలేకరుల ముసుగులో బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏదైనా వస్తువులను, పశువులను రవాణా చేసేటప్పుడు ధ్రువీకరణ పత్రాలతో తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు



అదుపులోకి తీసుకున్న నిందితులు

జైపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు జైపూర్ రెండవ ఎస్‌ఐ నాగరాజు బుధవారం పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర దేవాలయంలో ఈ నెల 1న, రసూల్ పల్లి హనుమాన్ ఆలయంలో ఈ నెల 7న దొంగతనాలకు పాల్పడిన గోదావరిఖని పట్టణానికి చెందిన బెజ్జాల విష్ణు, తాటికొండ అనిల్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి ఆటోను వదిలిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా రెండు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ. 3 వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి చెన్నూరు కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసు ఛేదించడంలో ముఖ్య పాత్ర పోషించిన ఎస్‌ఐ శ్రీధర్, శ్రీరాంపూర్ ఎస్‌ఐ సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సదానందంను ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అభినందించారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తల్లీకూతురును హత్య చేసిన కేసులో నిందితుడు కొక్కిస వెంకటేశ్ (55)కు జీవిత ఖైదుతోపాటు 2,500 రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపల్లికి చెందిన కొక్కిస వెంకటేశ్ అలియాస్ వెంకన్న బతుకుదెరువుకోసం హుజూరాబాద్‌కు వచ్చి జీవిస్తున్నాడు. అతడి మొదటి భార్య ముప్పై ఏళ్ల క్రితం విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అనంతరం కూతురు ఉన్న రమను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆటో నడుపుకుంటూ స్థానిక ప్రతాపవాడలో నివాసముంటున్నాడు. తరచూ భార్య, కూతురుతో ఆర్థిక విషయాల్లో గొడవలు జరుగుతుండేవి. దీంతోపాటు వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానం పెంచుకున్నాడు. 21 జనవరి 2021న రాత్రి భార్య రమ, కూతురు ఆమని(24) నిద్రిస్తుండగా ఇనుపపైపుతో తలలపై తీవ్రంగా గాయపరిచి చంపాడు. హుజూరాబాద్ పోలీసులు వెంకటేశ్‌పై కేసు నమోదు చేయగా ఏసీపీ కె .వెంకటరెడ్డి దర్యాప్తు చేపట్టారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరి శ్రీరాములు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి విచారించారు.

బొగ్గు ఉత్పత్తి 93 శాతం సాధించాం



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు 93 శాతం ఉత్పత్తి సాధించామని సీఎం డీ బలరాం అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిని ఆయన బుధవారం సందర్శించారు. కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ , ఉత్పత్తి రెండు రెండు కళ్లు అని తెలిపారు. ప్రతి రోజు అధికారులు, కార్మికులు కలిసి కట్టుగా ఉత్పత్తి లక్ష్యాన్ని సాదించేందుకు కృషి చేయాలన్నారు. యాజమాన్యం ప్రమాద రహిత ఉత్పత్తికి పెద్దపీట వేస్తుందన్నారు. అధికారులు, కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగవని సూచించారు. అనంతరం సీఎండీని జీఎం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్, కేకే 1 గ్రూపు ఏజెంటు రాందాస్, ఏరియా రక్షణాధికారి రవీందర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శులు దాగం మల్లేష్, అక్బరలీ, ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఏరియాలోనికేకే 5 గనికి చెందిన కోల్‌కట్టర్‌లు, ఎస్‌డీఎల్ ఆపరేటర్లను ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు నాణ్యమైన కోల్‌బిట్టు, డ్రిల్ రాడ్లు రావడం లేదని , ఎస్‌డీఎల్ యంత్రాలు చాలా కాలం వాటివని, మరో మూడు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు కేటాయిస్తే మెరుగైన ఉత్పత్తి సాధిస్తామని వివరించారు. సమస్యలను పరిష్కరించాలని జీఎంకు సీఎండీ సూచించారు.

ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోని, ఉత్పత్తిని పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరాం అన్నారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్, ఆర్‌కే 6, ఆర్‌కే 5, శ్రీరాంపూర్ సీహెచ్‌పీ, ఓసీపీలను డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వి సూర్యనారాయణ, డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె. వెంకటేశర్లుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణిలో ఒక మెట్రిక్ టన్నుకు ఉత్పత్తి ఖర్చు 7వేల 576 రూపాయలు అవుతోందని, బొగ్గును మాత్రం బహిరంగ మార్కెట్‌లో 4 వేల రూపాయలకే అమ్ముతున్నామని తెలిపారు. దీనివల్ల మూడు వేల రూపాయలకు పైగా సంస్థ నష్టపోతుందన్నారు. మరోవైపు చంద్రాపూర్‌లో టన్నుకు 4 వేల రూపాయలకు, కొన్ని కంపెనీలు 1, 500 రూపాయలకు, కోల్ ఇండియాలో వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీని తట్టుకోవాలంటే ఉత్పత్తి ఖర్చును సింగరేణి తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చివరగా న్యూటెక్ గనిలో దిగి పనిస్థలాల్లో ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్, ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్‌కే 7 గ్రూపు ఏజెంట్ రాజేందర్, ఆర్‌కే 5, 6 గ్రూపు ఏజెంట్ శ్రీధర్, డీజీఎం పర్సనల్ పి. అరవిందరావు, సీహెచ్‌పీ డీజీఎం చంద్రలింగం, గనుల మేనేజర్లు తిరుపతి, సుధీర్ కుమార్ ఝా, తిరుపతి, స్వామి రాజు, సీనియర్ పీవో కాంతారావు, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉత్పత్తి, రక్షణ రెండు కళ్లలాంటివని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అన్నారు. కాసిపేట1, 2 గనుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సింగరేణి సంస్థ ద్వారా కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మందమర్రి జీఎం దేవేందర్, 1వ గని మేనేజర్‌భూ శంకరయ్య, 2వ గని మేనేజర్ లక్ష్మీనారాయణ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సీఎండీని కలిసి.. సమస్యలు విన్నవించి..

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ బలరాంను పలువురు నాయకులు, కార్మికులు, అధికారులు బుధవారం కలిసి సమస్యలు విన్నవించారు. సీఎండీ మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీని పునరుద్ధరించాలని, కేకే 6 గనిని ప్రారంభించాలని, కేకే 5 గని జీవిత కాలం పెంపుదలకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఐఎన్టీయూసీ నాయకులు సింగరేణి సీఎండీ బలరాంకు వినతి పత్రం సమర్పించారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): అధికారులకు ఈ-8 ఇంటర్వ్యూలు నిర్వహించి త్వరగా పదోన్నతులు కల్పించాలని సీఎంఓఏఐ సింగరేణి శాఖ ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు సీఎండీ బలరాంకు ఆయన వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్ టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేందర్ రెడ్డి సీఎండీ ఎన్ బలరాంకు వినతిపత్రం అందజేశారు.

గనులను తనిఖీ చేసిన సీఎండీ



న్యూటెక్ గనిని పరిశీలిస్తున్న సీఎండీ బలరాం, అధికారులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ ఎన్ బలరాం బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులను సుడిగాలిలా తిరుగుతూ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆర్‌కే 7 గనిలో ఉన్న క్యాంటీన్‌లో ఉద్యోగులతో కలిసి టిఫిన్ చేశారు. అనంతరం నూతనంగా ఉద్యోగాలు పొందిన జేఎంఈటీల నుంచి సలహాలు తీసుకున్నారు. ఉత్పత్తి పెంపునకు ఎలాంటి చర్యలు చేపట్టాలని వివిధ కేటగిరీల ఉద్యోగుల నుంచి సూచనలు స్వీకరించారు.

రిజర్వ్ ఫారెస్టులో మొరం తవ్వకాలు

- ఐదుగురిపై కేసు నమోదు

బెజ్జూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపుగూడ సమీపంలోని రిజర్వ్ ఫారెస్టులో మొరం తవ్వకాలపై ఐదుగురిపై ఫారెస్టు అధికారులు కేసు నమోదు చేశారు. మంగళవారం సమీప రిజర్వ్ ఫారెస్టులో ఎక్స్‌కావేటర్‌తో మొరం తవ్వుతున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించే లోపే అక్రమార్కులు వెళ్లిపోయారు. బుధవారం రేంజ్ అధికారి ముసావీర్ మొరం తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించారు. సులుగుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు, మర్థిడి గ్రామానికి చెందిన ముగ్గురు అనుమానితులుగా ఉన్న ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చెట్లను నరికిన ఇద్దరి అరెస్టు

వేమనపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నీల్వాయి ఫారెస్టు రేంజ్ కార్యాలయం పరిధిలోని కాటేపల్లి అట వీ బీట్ పరిధిలో అక్రమంగా చెట్లను నరికిన మానేపల్లి రాజన్న, మానేపల్లి నరేష్‌లను బుధవారం అదుపు లోకి తీసుకుని కేసు నమోదు చేసి చెన్నూరు కోర్టులో హాజరు పర్చినట్లు నీల్వాయి ఎఫ్‌ఆర్‌వో అప్పల కొండ తెలిపారు. అక్రమంగా చెట్లను నరికి చదును చేసినందుకు అటవీ చట్టం ప్రకారం ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

జాతర ప్రారంభం

నెన్నెల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం ఘనం గా ప్రారంభమైంది. ఈ నెల 14 వరకు జాతరను నిర్వహించనున్నారు. జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ఎస్సై శ్రీధర్, జైపూర్



గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్సై : నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. దుకాణాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు, వ్యాపారులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి.?

ఎస్సై : తరుచుగా వాహనాలను తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మైనర్లు బైక్‌లు నడపకుండా చర్యలు తీసుకుంటున్నాం. మద్యం సేవించి వాహనాలు నడపకుండా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : గ్రామాల్లోని యువకులు మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ప్రోత్సహిస్తున్నాం. క్రీడా పరికరాలను అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వారసంతలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎస్సై : వారసంత జరిగే రోజున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తూ రోడ్లపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుంటున్నాం. పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలిపేలా చూస్తున్నాం.

- జైపూర్, ఆంధ్రజ్యోతి

సంక్షిప్త సమాచారం

మంచిర్యాల క్రైం: మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంకు చెందిన అటకపురం రాజలింగు (48) కుటుంబ కలహాల వల్ల జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంచిర్యాల క్రైం : మంచిర్యాల పట్టణానికి చెందిన ఓ మహిళను ప్రేమిస్తున్నానని మోసం చేసిన తాటికొండ రాంచందర్ అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఒక మహిళను రాంచందర్ నాలుగు సంవత్సరాల నుంచి తనను ప్రేమిస్తున్నా నని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● సీసీ కార్నర్‌కు చెందిన సబ్బని భాస్కర్ అనే విలేకరిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల వంద ఫీట్ల రోడ్డులోని చర్చి దగ్గర గొడవ జరుగుతుందని తెలుసుకొని అక్కడికి వెళ్లడంతో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై దాడి చేశారు. భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దండేపల్లి: మండల కేంద్రంలో స్థానిక కస్తూర్బీ గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి నిర్మాణాత్మక పరీక్షల అంతర్గత మూల్యాంకన మార్కుల వివరాలపై జిల్లా మానిటరింగ్ బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డిఈవో ఆదేశాల మేరకు బుధవారం కేజీబీవిని వారు సందర్శించి పదవ తగరతి విద్యార్థులకు నిర్మాణ్మాతక పరీక్షలలో వచ్చిన మార్కుల వివరాలు, ఆన్‌లైన్ నమోదైన మార్కుల వివరాలు, రికార్డులను బృందం సభ్యులు తనిఖీ చేసిన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ బృందం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి‌సుదర్శన్, శ్రీనివాస్, విద్యాలయ ఎస్‌వో మంజుల ఉన్నారు.

లక్షెట్టిపేట రూరల్: మండలంలోని జెండవెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదివే దుర్గం వర్షిత్ అనే విద్యార్థి నేషనల్ మెయిన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోధర్ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థికి ప్రతీ ఏటా 12వేల రూపాయల చొప్పున ఐదు సంవత్సరాలు అందజేస్తామన్నారు. వర్షిత్‌ను హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బస్టాండ్, ఇతర ప్రాంతాలలో ఫింగర్ ప్రింట్ మిషన్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. అలాగే నేరాల నియంత్రణ కూడా సాధ్యమవుతుందన్నారు. సాయంత్రం వేళలో కాలనీలను పర్యటిస్తూ అనుమానితులను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు



తరచూ రోడ్డెక్కుతున్న అన్నదాతలు

వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై వేటు

చెన్నూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఈ అక్రమాలపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై వేటు వేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఆధార్‌కార్డు ద్వారా వ్యవసాయ శాఖ పంట నమోదు చేసిన రైతుల పత్తిని కొనుగోలు చేశారు. అయితే పంట నమోదు కాని రైతులు కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించాలంటే ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాల ద్వారా కొనుగోలు కేంద్రాల్లో టీఆర్ (తాత్కాలిక రిజిస్ట్రేషన్) ద్వారానే పత్తిని అమ్మాల్సి ఉంటుంది. ఈ టీఆర్‌లకు సంబంధించి మార్కెట్ కమిటీ కార్యదర్శికి వచ్చే ఓటీపీ ద్వారా మాత్రమే పత్తిని కొంటారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా 200లకు పైగా టీఆర్‌లను కాసులకు కక్కుర్తి పడి కార్యదర్శి జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో రైతులు వరుసగా రోడ్డెక్కి రాస్తారోకోలు చేయడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరడం..విచారణ చేయడం తాజాగా కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేయడం చకచకా జరిగిపోయాయి.

కొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లకు సంబంధించి రైతుల ఫొటోలు తప్పుగా ఉండడంతో సైతం సస్పెన్షన్‌కు గురైనట్లు తెలుస్తోంది. అదే విధంగా మార్కెట్ కమిటీ యార్డులోని కంప్యూటర్ ఆపరేటర్లు ఒక్కో టీఆర్ నమోదు చేసుకునేందుకు దళారులు రూ. 1000 నుంచి 3 వేల వరకు వసూలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీఐ కొనుగోళ్లలో కిందిస్థాయి సిబ్బంది నుంచి మార్కెట్ కమిటీ కార్యదర్శి వరకు దళారులు, వ్యాపారులతో కుమ్మక్కై పత్తి కొనుగోలు కేంద్రంలో అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుంది.

ఆందోళనలు, ధర్నాలు

వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, సీసీఐ అధికారుల అక్రమాలను ఎండగడుతూ నియోజకవర్గంలోని రైతులు ఆందోళనలు, ధర్నాలు చేస్తూ మూడు రోజుల క్రితం రోడ్డెక్కారు. దళారులు తీసుకు వచ్చిన పత్తిని నేరుగా విక్రయిస్తున్నారని, రైతులు తెచ్చిన పత్తికి అడ్డ గోలు ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొంటూ రైతులు పలుమార్లు జిన్నింగు మిల్లుల ముందు ఆందోళనలు చేశారు.

సేకరించిన పత్తి వివరాలు..

చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చెన్నూరు, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు సీసీఐ ద్వారా 3,05,167 క్వింటాళ్ల పత్తిని విక్రయించినట్లు అధికారు లు పేర్కొన్నారు. నాలుగు మండలాల పరిధిలోని 10,659 మంది రైతుల వద్ద నుంచి పత్తి ని కొనుగోలు చేయగా ఇప్పటి వరకు రూ. 221కోట్ల 79లక్షల వరకు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇంకా 620 మందికి 8 కోట్ల 6 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు కిష్టంపేట వరలక్ష్మీ జన్నింగు మిల్లులో 64,439 క్వింటాళ్ల పత్తి, ఎల్లక్కపేట ఆది శంకరాచార్య జిన్నింగు మిల్లులో 43,648 క్వింటాళ్ల పత్తిని, పట్టణంలోని చెన్నూరు కాటన్ మిల్లులో 53,668 క్వింటాళ్ల పత్తిని, శివలింగాపూర్ జీఆర్‌ఆర్ జిన్నింగు మిల్లులో 1,07,494 క్వింటాళ్ల పత్తిని, కోటపల్లి మండలంలోని పారుపెల్లిలోని నవదుర్గ కాటన్ మిల్లులో 35,882 క్వింటాళ్ల పత్తిని రైతుల వద్ద నుంచి సీసీఐ కొనుగోలు చేసింది.

వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

చెన్నూరు మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు వెలుగుచూడడంతో విచారణ చేసిన అధికారులు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్‌చార్జి కార్యదర్శిగా బుధవారం షాబొద్దీన్ అదనపు బాధ్యతలు స్వీకరించారు.

కొనుగోలు కేంద్రాల్లో దళారులకు పెద్దపీట

చెన్నూరు మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని పత్తి కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, సీసీఐ అధికారులు దళారులకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దళారులు తీసుకువచ్చిన పత్తి వాహనా లను డైరెక్టు కొనుగోలు కేంద్రాలకు అనుమతులు ఇచ్చేవారని ఆరోపణలు ఉన్నాయి.



చెన్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు(ఫైల్)

ఘనంగా నర నారాయణ స్వామి జాతర

జన్నారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలమడుగు గ్రామంలో నర నారాయణ స్వామి ఆలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా జాతర మూడవ రోజు బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గీతాహవనం కార్యక్రమం నిర్వహించారు. యజ్ఞం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే జాతర సందర్భంగా వాలీ బాల్ పోటీలను నిర్వహిస్తుండగా బుధవారం ఖానాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కాకెర నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, గ్రామ నాయకులు గుంతల మల్లేష్ పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న జాన్సన్ నాయక్, మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు

భీమిని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఉన్నత పాఠశాల పక్కన, పెద్దపేట, కేస్లాపూర్, రాజారం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వీటి వల్ల నేరాల నియంత్రనతో పాటూ ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు వ్యక్తులను గుర్తించడం సులభం అవుతుందన్నారు. మండలంలో అన్నీ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు సురేష్, వినోద్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



భీమిని పాఠశాల పక్కన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న ఎస్సై

కాసిపేట : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం దేవాపూర్‌లోని గొల్లవాడలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగడతాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న చోట దొంగతనాలు, నేరాలు చేయడానికి భయపడతారని తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్థులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రోడ్డు పనులు

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నాల గ్రామం నుంచి బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం వరకు చేపట్టిన రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ రోడ్లు భవనాల శాఖ, ఫారెస్టు అధికారులతో మాట్లాడి రోడ్డు వేయడానికి ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం చేస్తున్నారు.

75వ వసంత వేడుకలు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ శాఖ 1104యూనియన్ 75వ వసంత వేడుకలను బుధవారం ఆ సంఘం ఉద్యోగులు వైభవంగా జరుపుకున్నారు. ముందుగా యూనియన్ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఫోర్‌మెన్ మెట్టు రాజేశ్వర్, నర్సింగ్‌రావు, శంకరయ్య, చంద్రమౌళి, రాజమౌళితో పాటు ఉద్యోగులు కార్మికులు ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్-2లో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈసం దర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి చదువు పునాది లాంటి దని చిన్నతనం నుంచే చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు చర్యలు తీ సుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ అలివేణి, చిన్నరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుపై వ్యాపారుల ఇష్టారాజ్యం

● రాంగ్ పార్కింగ్‌లో లారీలు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 12(ఆంధ్రజ్యోతి): పేరుకే లక్షెట్టిపేట మున్సిపాలిటీ కానీ ఎటు వెల్దామన్న ఇరుకురోడ్డుతో నరకయాతన పడాల్సిందే. చుట్టుపక్కల ఉన్న మున్సిపాలిటీలు రోజు రోజుకూ అభివృద్ధి పథంలో ముందుకు సాగితే లక్షెట్టిపేట మున్సిపాలిటీ మాత్రం అక్కడే ఉంటోంది. స్థానిక ఊత్కూర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు ఉంటాయి. వారి వ్యాపారాలు కూడా లక్షలు కోట్లలో సాగుతూ ఉంటుంది. ఎప్పుడు బీజీగా ఉండే ప్రాంతం కావడంతో నిత్యం భారీ వాహనాల్లో కిరాణ సామగ్రి, బియ్యం బస్తాలు ఇలా పలు రకాల వస్తువులు వస్తుంటాయి. అయితే వ్యాపారులు ఏకంగా సామాన్లను దింపుకునేందుకు రోడ్డుపైనే లారీలను ఆపి దింపడంతో వచ్చిపోయే వాహనదారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో పోలీసులు ఎన్ని సార్లు చెప్పినప్పటికీ వాళ్ల పద్ధతి మారడంలేదు. రెండు మూడు ట్రాన్స్‌పోర్టు లారీల్లో నిత్యం వ్యాపారుల సామన్లు పరిమితికి మించి భారీలోడ్ వేసుకుని మధ్యాహ్నమే వస్తుంటాయి. ఇరుకు రోడ్డు అని కూడా చూడకుండా దుకాణాల ముందే లారీని ఇష్టం వచ్చినట్టు నిలిపి కూలీలతో అన్‌లోడ్ చేపించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా వెళ్తుండడంతో మరీ ఇబ్బంది ఏర్పడుతోంది. అటు ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడు తుంది. అంతే కాకుండా కొన్ని ప్రాంతాల్లో లారీలను రాంగ్‌రూట్లో నిలిపి కూడా అన్‌లోడ్ చేపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌పోర్టు లారీలు రోడ్డుపై నిలపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.



లారీని రోడ్డుపై ఆపి అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు

సతీష్, ఎస్సై లక్షెట్టిపేట



ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఎవరిని విడిలేది లేదు తప్పకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది. గతంలో ట్రాన్స్‌పోర్టు యజమానులకు, వ్యాపారులకు చాలా సార్లు రోడ్లపై లారీలను నిలపకూడదని చెప్పాము. ఫైన్‌లు కూడా వేసాం కానీ వారి ప్రవర్తనలో మార్పు రావడంలేదు. ఈసారి ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి రోడ్లపై నిలిపి అన్‌లోడ్ చేసిన, రాంగ్ రూట్లో లారీలను ఆపిన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు అడ్డంకులు తొలగేనా...?

(5వ పేజీ తరువాయి)

అసైన్‌మెంట్ చట్టం ప్రకారం అర్హతగల వారు మాత్రమే సాగు కోసం కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది. అయితే సదరు భూము ల్లో అనేక మంది లబ్ధిదారులు ఇప్పటికీ సాగు చేస్తుండగా, కొంత మొత్తం మాత్రం అన్యాక్రాంతం అయిందనే ఆరోపణలు ఉన్నాయి.

● పరిహారం చెల్లింపులపైనే సందిగ్ధం..

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేయబోయే భూముల లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులే ప్రధానం కానున్నాయి. ప్రభుత్వపరంగా అసైన్‌మెంట్ చట్టం ప్రకారం పట్టాలు పొంది ఉన్నందున ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే లబ్ధిదారులతో గతంలో సమావేశం ఏర్పాటు చేసి ఎకరాకు రూ. 10 లక్షలు పరిహాం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు ససేమిరా అంటున్నారు. ప్రస్తుతం భూముల ధర మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ. 6.5 లక్షలు ఉంది. ప్రభుత్వం భూ సేకరణ జరుపుతున్నందున దానికి మూడు రెట్ల పరిహారంతోపాటు సొలేటియం కూడా చెల్లించాలనే నిబంధన ఉంది. ఆ ప్రకారం ఎకరా ఒక్కంటికి రూ. 22 లక్షల పైచిలుకు అవుతుందని, ఆ మేరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయం మేరకు ధరల చెల్లింపులు ఆధారపడి ఉండగా, ఆ సమస్య పరిష్కరిస్తేనే ఐటీ పార్కు ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో ఎప్పుడో ప్రభుత్వం అసైన్ చేయడం, ప్రస్తుతం అతి తక్కువ మంది లబ్ధిదారులు ఖాస్తులో ఉండటంతో మిగతా వారికి సదరు భూములపై పూర్తి హక్కులు లేవనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో నష్టపరిహారం చెల్లింపులపై సందిగ్ధం నెలకొంది.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల గోదావరి తీరంలోని గౌతమేశ్వర ఆలయం ప్రాంగణంలో మంచిర్యాల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 152 ఆర్యవైశ్య దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గడియారం బాలాజీశర్మ వేద మంత్రాల మధ్య సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను వైభవంగా చేయించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ ముక్తా శ్రీనివాస్, ప్రోగ్రాం చైర్మన్ పడకంటి శ్రీనివాస్, ఆలయ ఫౌండర్ గోపగారి శ్రీదేవి, రీజియన్ చైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, ప్రోగ్రాం క్యాషియర్ రాజేంద్ర ప్రసాద్, వాసవీ క్లబ్, వనిత క్లబ్, కపుల్స్ క్లబ్, యూత్ క్లబ్ సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

నిందితుడిపై పీడీయాక్టు నమోదు చేయాలి

గర్మిళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన వీర రాఘవరెడ్డిపై పీడీయాక్టు పెట్టాలని మంచిర్యాల జిల్లా అర్చక సంఘం నాయకులు పేర్కొన్నారు. దాడికి నిరసనగా బుధవారం మంచిర్యాలలో నిరసన తెలిపారు. దాడి చేసిన వీర రాఘవరెడ్డిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంతోష్, సంగర్కర్ శర్మ, రమేష్ శర్మ, సంతోష్, శ్రీనివాస్, ప్రవీణ్, రవీంద్రచారి, అనిల్, కర్ణకంటి రవీందర్ పాల్గొన్నారు.

తాండ్ర కుమార్ వర్ధంతిని విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న హైద్రాబాద్‌లో నిర్వహించే ఎంసీపీఐయూ పొలిట్ బ్యూరో సభ్యుడు, అమర జీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ వర్ధంతిని విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వర్ధంతి సభ కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రమేష్, సతీష్, రాహుల్,రవి, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కల గుట్ట గ్రామంలో బుధవారం మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని రుష్యముఖ పర్వతంపై వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షణ నిర్వహించారు. కల్యాణాన్ని వేద పండితులు శ్రీనివాసశర్మ, నర్సింహాచార్యుల మంత్రోచ్చరణల మధ్య కళ్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, బొక్కలగుట్ట గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూతో భయం భయం...

స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేస్తున్న విక్రయదారులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ భయం చికెన్ విక్రయదారులను భయపెడుతుంది. తెలంగాణ ప్రభుత్వం కొద్ది రోజుల పాటు చికెన్ తినవద్దని ఉత్తర్వులు కూడా జారీ చేయడంతో చికెన్ విక్రయాలు తగ్గిపోయాయి. పట్టణంలో చికెన్ దుకాణాలు మూసివేస్తున్నారు. ఈ వ్యాధితో పెద్ద ప్రమాదం ఏమిలేకపోయినప్పటికి చికెన్ విక్రయాలు ఎవరు చేయడం లేదు. ముక్క లేనిదే ముద్ద దిగని ప్రియులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. చికెన్‌భోజన ప్రియులు మటన్ వైపు మళ్లుతున్నారు. ఈ వ్యాధి భయంతో మటన్ షాపులకు పెద్ద ఎత్తున గిరాకీ పెరిగింది. ఇదే ఆసరగా మటన్ షాపుల విక్రయదారులు కిలో నుంచి 2 కిలోలు కొంటే 1200 రూపాయలు విక్రయించడం విషేషం. ఏది ఏమైనా చికెన్ వ్యాపారులకు ఈ వ్యాధి కోల్కోలేని విధంగా దెబ్బతీస్తుందనేది వాస్తవం. ఈ వ్యాధి తగ్గుముకం పడితే తప్ప షాపులు తెరవ వద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

జన్నారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ పట్ల అప్ర మత్తంగా ఉండాలని వెటర్నరీ అధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని కోళ్లఫారాలను ఆయన పరిశీలించారు. యాజమానులకు పలు సూచనలు చేశారు. కోళ్లు మృత్యువాత పడ్డాయా, ఎలాంటి వ్యాధులకు గురవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. కోళ్లు మృతిచెందితే చేతులో పట్టుకోకుండా గోనెంసచిలో వేసి ఊరికి దూరంగా గుంతలు తవ్వి తడి సున్నం వేసి పూడ్చిపెట్టాలని సూచించారు.

జనసంద్రం



జాతరకు హాజరైన భక్తులు

- గంగాపూర్ జాతరకు పోటెత్తిన భక్తులు
- కన్నుల పండువగా రథోత్సవం
- ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర వాసులు రాక

రెబ్బెన, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా రెబ్బెన మండలం గంగాపూర్ శివారులోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన జాతరకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచి స్వామి వారి దర్శనాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం భక్త జనం సందోహం అంతంత మాత్రంగా ఉన్నప్పటికి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో గంగాపూర్ ఆలయ పరిసరాలు భక్తులత తాకిడితో కిట కిటలాడింది. స్వామి వారి దర్శనానికి ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100 ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులకు దర్శనం సులభతరంగా జరిగింది. సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలోని పంచలోహ విగ్రహాలను పల్లకిలో భజాభజంత్రీలతో వేద పండితుల మంత్రోచరణల మధ్య రథాలపైకి చేర్చారు. భక్తులు ఆనంద పారవశ్యంతో మునిగి తేలుతు స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్టు ఆలయాధికారులు అంచనా వేశారు.

• నాయకులు, అధికారుల పూజలు

శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి, మంచిర్యాం జిల్లా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిరోష, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె విశ్వప్రసాద్‌రావు, అడిషన్ కలెక్టర్ వేణు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, తహసీల్దార్ రాంమోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, సీఐ బుద్ద స్వామి, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు స్వామి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వ ప్రసాద్ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, ఏఎస్పీలను ఆలయ అధికారులు సన్మానించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్‌ను స్థానిక నాయకులు సన్మానించారు.



భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

• ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. జాతర ప్రాంతంలో తిరిగి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. దీంతో రాకపోకలకు ఇబ్బం దులు తలెత్తలేదని భక్తులు చెబుతున్నారు. రథోత్సవ సందర్భంగా ప్రత్యేక పోలీసులను అందుబాటులో ఉంచడంతో కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.



రథం లాగుతున్న భక్తులు

• దాతల సహకారంతో అన్నదానం

ఏటా మాదిరిగానే ఈ సారి కూడా రెబ్బెన మం డల కేంద్రానికి చెందిన పలువురు వర్తక, వ్యాపారులు దాతల సహకారంతో జాతరకు వచ్చిన భక్తు కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 50వేల మంది హాజరయ్యారు. వీరందరికీ అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆ త్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్ర సాద్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నాయకులను సన్మానిస్తున్న సభ్యులు



క్యూలైన్లో దర్శనానికి వెళ్తున్న భక్తులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషేంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని బుధవారం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సుభాష్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. లేని పక్షంలో ఈనెల 17 నుంచి విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 'ఎణవంత్‌రావు, మమత, మల్లేష్, మురళీ, ప్రేమలత, జ్ఞానేశ్వర్, ఫైమద్, కిష్టయ్య, శ్రీశైలంలు పాల్గొన్నారు.

అడవుల్లో నిప్పు పెట్టకూడదు

కెరమెరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో నిప్పు పెట్టకూడదని కెరమెరి అటవీ రేంజ్ అధికారి మజరొద్దీన్ అన్నారు. ఉమ్రి గ్రామంలో ఆయన బుధవారం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. . అడవుల్లో మంటలు చెలరేగి విలువైన అటవీ సంపదతో పాటు వన్య ప్రాణుల మనుగడకు విఘాతం కల్గుతుందని తెలిపారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభించాలి

జైనూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని మండలంలోని జామ్ని, రాసిమెట్ట, గూడామామడ గ్రామాల కూలీలు కోరారు. మండల కేంద్రంలో ఉపాధి కూలీలు బుధవారం విలేకరుతో మాట్లాడారు. వ్యవసాయ పనులు ముగియడంతో ప్రస్తుతం ఖాళీగా ఉన్నామని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

వాంకిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాహారాష్ట్ర నుంచి వాహనంలో అక్రమంగా 20 పశువులను బుధవారం పట్టుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మహారాష్ట్రలోని గడ్చిరోలీ నుంచి బుధవారం హైదరాబాద్‌లోని శామిర్‌పేట మార్కెట్‌లో విక్రయించేందుకు వాహనం(ఎంహెచ్34 బీజడ్ 3709)లో అక్ర మంగా 20 పశువులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం వచ్చిందన్నారు. దీంతో వాంకిడి మండలంలోని ఖమన ఎక్స్ రోడ్డు వద్ద ఏఎస్సై పోశెట్టి, పోలీసు సిబ్బందితో కలిసి పట్టుకున్నామన్నారు. వాహనంలో తరలిస్తున్న పశువులకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేవని చెప్పారు. దీంతో పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించామని తెలిపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాంకిడి చెందిన డ్రైవర్ ఖోబ్రగడే మన్‌ప్రీత్, వాంకిడి మండలంలోని మహాగామ్‌కు చెందిన వ్యాపారులు షేక్ యూనుస్, షాదుల్ ఖాన్, షేక్ అజీమ్‌ల పై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన 317 జీవో బాధితుల సమస్య పరిష్కరించే వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలుపనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం గుండి ఉన్నత పాఠశాలలో 317 జీవో బాధితుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ పరిధిలో 8వేల మంది 317 జీవో బాధితులు ఉన్నారన్నారు. బాధితులు ఒకే తాటిపై ఉండి తమ సమస్య పరి ష్కారం కోసం కృషి చేసే వారికి ఓటు వేయాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రిలో వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలో పేద రోగులకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి ప్రతిరోజు వందలాది మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించి పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకరి పెంటు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసి ఎంపీలు, ఎమ్మెల్యే



కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీలు, ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి గజేంద్రసింగ్‌ను ఢిల్లీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, విశ్వేశ్వర్‌రెడ్డి, గోడెం నగేష్, ఎమ్మెల్యే హరీష్‌బాబు ఉన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

కౌటాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యాదవ కులస్తులు బుధవారం బీరప్ప పండుగను ఘనంగా నిర్వహించారు. గత గురువారం నుంచి బీరప్ప ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బీరప్ప ఆలయం ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు రూ.10లక్షలు నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం బీరప్ప ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా సంత్ గురు రవిదాస్ జయంతి

వాంకిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేతావన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సంత్ గురు రవిదాస్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కార్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జైరాం ఉప్రె, నాయకులు దుర్గం హంసరాజ్, విలాస్, రాజెంద్రప్రసాద్, దుర్గం ప్రశాంత్, ప్రతాప్, రోషన్, విజయ్‌ఉప్రె, పాల్గొన్నారు.

మహాదేవ్ జాతర ప్రారంభం

సిర్పూర్(యు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల మహాదేవ్ ఆలయంలో బుధవారం నుంచి మహాదేవుడి జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీరావ్ రాజ మహాదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ప్రెసిడెంట్‌గూడ, బజార్‌గూడ, ఖాతీగూడ, దేవుగూడ, పాములవాడ ,పూల్లర తదితర గ్రామల నుంచి ఆదివాసీలు మహాదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, పూజరి ఆత్రం శ్రీరావ్ రాజ, ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం దౌలత్‌రావు, వైస్ చైర్మన్ ఆత్రం గోవింద్‌రావు, గ్రామ పెద్దలు దుర్వ మోతిరాం, ఆత్రం ఆనంద్‌రావు, సెడ్మకి గణపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కెరమెరి , ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్‌ఖెడ, గోయగాం, రింగన్ ఘాట్ పాఠశాలల్ని బుధవారం జిల్లా విద్యా శాఖ అధికారి గమనీయల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆనంతరం పాఠశా ఆయా పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని చెప్పారు. సకాలంలో నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమలో ఎంఈవో అడె ప్రకాష్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగయ్య, సత్యనారాయణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి

బెజ్జూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం బెజ్జూరు ఎంపీడీవోగా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడు తామని చెప్పారు. సమస్యలను గుర్తించి దశల వారీగా పరిష్కారానికి పాటుపడుతామని ఎంపీడీవో తెలిపారు.

రోగులకు పండ్ల పంపిణీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావ్ పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు సంఘ నాయకులు సర్కిల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఈ జీవరత్నం,అకౌంట్స్ అధికారి తుకారం, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విలాస్, వెంకటేష్ నాయకులు రమేష్, మహేందర్, రాంరెడ్డి, మురళి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తుల రద్దీ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల బుధవారం సమ్మక్క, సారలమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలు మండలాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మరమేశ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పూర్తి ఏర్పాట్లు చేశారు. వనదేవతలకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం లక్ష్మీంపూర్ శివారులోని వెలసిన సమ్మక్క, సాలరమ్మల గద్దెల వద్ద బుధవారం భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. గంగాపూర్ జాతరకు వచ్చిన భక్తులు కొద్ది దూరంలోనే ఉన్న సమ్మక్క, సాలరమ్మలను కూడా దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి దేవర వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సిర్పూరు(టి), (ఆంధ్రజ్యోతి): కోనేరు కాలనీలో ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద బుధవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పూజలు నిర్వహించారు

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో ఉన్న సమ్మక్క-సారలమ్మ వద్ద బోనాల పండగను గ్రామ ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ అమ్మవార్లకు బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకంటే ముందు సమ్మక్క- సారల మ్మ వద్ద శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న జాతర కమిటీ అధ్యక్షుడు రమేశ్



లక్ష్మీపూర్‌లో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు